క్లుప్తంగా

వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసురత్నం

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 12, 14 మెమోను రద్దు చేసి బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, ఏసురత్నం, జిల్లా కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ నాయకుడు బాషా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. సమావేశంలో యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాముడు పాల్గొన్నారు.

ప్రమాదంలో వంతెన



బ్రిడ్జికి అడ్డుపడ్డ గుర్రపు డెక్క

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో కుందూనదిపై నిర్మించిన బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు దిగువకు వరద నీరు ఉధృతంగా వస్తుంది.ఈ నీటిలోనే కొట్టుకు వస్తున్న గుర్రపుడెక్క క్రిష్టిపాడు బ్రిడ్జి వద్ద అడ్డుగా పడింది. దీంతో వరద నీరు సాఫీగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి వెంటనే గుర్రపు డెక్కను తొలగించాలని, లేదంటే వంతెన దెబ్బతిని రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు.

సీపీఎం నేత షడ్రక్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ నేత షడ్రక్ 5వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేపర్ మిల్లు కార్మికుల సమస్యలపై షడ్రక్ అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, పట్టణ కార్యదర్శి పుల్లానరసింహులు, సీఐటీయూ జిల్లా నాయకులు బాల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని టౌన్ మున్సిపల్ పార్కులోని ఆయుష్ యోగా కేంద్రంలో ఈనెల 7వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని నిర్వాహకులు ప్రముఖ యోగా గురువు ఆనంద్‌గురూజీ ఆదివారం తెలిపారు. శిక్షణ కాలంలో సూర్యనమస్కారాలు, ప్రాణాయమం, ఆసనములు, క్రియలు, నేర్పబడుతాయన్నారు. అదే విధంగా ప్రతిరోజు హాజరైన వారికి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ఉదయం 5.20 గంటల నుంచి 6.30గంటల వరకు మొదటి బ్యాచ్ ప్రారంభం కాగా రెండో బ్యాచ్ 6.35గంటల నుంచి 7.45 గంటల వరకు నిర్వహించబడుతాయన్నారు. వివరాలకు సెల్ : 9989983673కు సంప్రదించాలన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ తులసీ క్రిష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా సమస్యలుంటే మండల ప్రజలు వినతులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

117 జీఓను రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల్లో ప్రకటించిన మేరకు 117వ జీవోను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని గాడిలో పెడతామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లా, మండల స్థాయిలో రాష్ట్రస్థాయి కమిషనరేట్ నుంచి సర్దుబాటు జరపాలని నిర్ణయించడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ పది మంది విద్యార్థులున్న పాఠశాలలను మూసివేసే ప్రయత్నం కూడా చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. విద్యారంగానికి, పాఠశాల మనుగడకు ఈ నిర్ణయం తీవ్ర హాని చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు భాస్కరరెడ్డి, గాలయ్య, శ్రీరాములు, రంగనాయకులు, నౌమాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

● నాది నైట్ డ్యూటీ!

అసలే వర్షాకాలం..దానికితోడు దోమల బెడద. దీంతో కంటిమీద కునుకు లేనట్టుంది ఈ ఆవుకు. ఏకంగా ఏటీఎం సెంటర్‌లోకి వెళ్లి ఏసీలో సేద తీరుతుంది. నంద్యాల పట్టణంలోని గిరిన్నాథ్ సెంటర్‌లోని ఇండియన్ బ్యాంక్ ఏటీఎంలో శనివారం రాత్రి ఈ దృశ్యం కనిపించింది. ప్రైవేటు బ్యాంకుల ఏటీఎంలకు సెక్యూరిటీ గార్డులు ఉండరు. దీంతో రాత్రి పూట వాటికి తామే కాపలుదారులమన్నట్టుగా మూగ జీవాలు ఖాళీగా ఉన్న ఏటీఎం సెంటర్లలోకి వెళ్లి విశ్రమిస్తున్నాయి.

–నంద్యాల(అర్బన్)





శిథిల భవనంలో చిరంజీవులు

పాడుబడ్డ భవనం.. దాని వద్ద బంగారు భవిష్యత్తు ఉన్న చిన్నారులు కనిపిస్తున్న ఈ దృశ్యం మేజర్‌పంచాయతీ కానాల గ్రామం ఎంపీయూపీ పాఠశాల ఆవరణలోనిది. ఈ భవనం 35ఏళ్ల క్రితం ఉర్దూ పాఠశాలగా, పీహెచ్‌సీ సబ్ సెంటర్‌గా ఉపయోగపడి నేడు నిరుపయోగంగా ఉది. శిథిలావస్థకు చేరుకొని కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఈ భవనం వద్దకు పాఠశాల విరామ సమయంలో విద్యార్థులు వెళుతుండటంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే ఈ పాత భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మాణానికి జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. –నంద్యాల(అర్బన్)

అలరించిన నృత్య రూపక ప్రదర్శన



నృత్య రూపకంలో ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: గురు పౌర్ణమి సందర్భంగా టీజీవీ కళాక్షేత్రం సౌజన్యంతో ఆదివారం రాత్రి సీ క్యాంప్‌లోని కళాక్షేత్రంలో ప్రదర్శించిన షిరిడీ సాయిబాబా నృత్య రూపకం అలరించింది. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కర్నూలు సాయి భక్తులచే ఈ నత్య రూపకాన్ని మొదటిసారి షిరిడీలో ప్రదర్శించడం జరిగిందన్నారు. అక్కడి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకున్నారన్నారు. రెండో ప్రదర్శన కర్నూలులో జరిగిందన్నారు. 120 మంది కళాకారులు సాయిబాబా జీవితాన్ని సంపూర్ణంగా ప్రదర్శించి మెప్పించారన్నారు. కళాక్షేత్రం తరపున కార్యక్రమ నిర్వాహకులు మహబలేష్, చింతా శ్రీనివాస్‌కు రూ.40 వేలు అందజేశారు. అంతకుముందు కూచిపూడి సిద్దేంద్ర నృత్య కళాశాల ప్రిన్సిపాల్ వేదాంతం రామలింగేశ్వర శాస్త్రి, జ్యోతి ప్రజ్వలన చేసి నాటక ప్రదర్శన ప్రారంభించి ప్రసంగించారు.

డోలమైట్ లారీ పట్టివేత

కర్నూలు (టౌన్): ప్యాపిలి నుంచి హైదరాబాద్‌కు అనుమతి లేకుండా డోలమైట్ పౌడర్ తరలిస్తున్న లారీని ఆదివారం సాయంత్రం విజిలెన్స్ రాయల్టీ అధికారులు పట్టుకున్నారు. భద్రత నిమిత్తం ఉల్లిందకొండ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఏలాంటి అనుమతులు లేకపోవడంతో జరిమానా విధించినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు.

రుద్రవరంలో రక్తదానం



రుద్రవరంలో కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం 1993–94 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా వారంతా కలిసి కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకొని శుభాకంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆ బ్యాచ్‌కు చెందిన 35 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్నేహితుల బృందం మాట్లాడుతూ రెండు నెలల నుంచి రక్తదానం చేయాలని ప్రణాళికలు చేసుకున్నామని తెలిపారు. గత కొన్నేళ్లుగా పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అలాగే కరోనా సమయంలో తమ వంతుగా పేదలకు నిత్యావసర సరుకులు అందించామన్నారు. స్నేహితుల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన వారి గురువు అల్లడి సుబ్బరాయుడు, ఎంఈఓ కోటయ్య, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బరాయుడు, రుద్రవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శిమోహన్, ఏపీఎన్‌జీఓ హెల్త్ అధికారి హుస్సేన్‌రెడ్డిలను శాలువా, పూలమాలలతో సత్కరించారు.

రౌడీషీటర్ హత్యకేసులో నిందితుల అరెస్ట్



నిందితులను చూపుతున్న డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలో రౌడీషీటర్ సాయికుమార్ అలియాస్ కవ్వను శుక్రవారం అయ్యలూరిమెట్ట వద్ద కత్తులతో నరికి చంపిన కేసులో 7 గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన సాయికుమార్‌కు రౌడీషీటర్ సంజీవకు కొంత కాలంగా పాత కక్షలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో శుక్రవారం మధ్యాహ్నం అయ్యలూరిమెట్ట సమీపంలోని పొలాల్లో సాయికుమార్.. మరి కొంత మంది స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తున్నాడన్న విషయం తెలుసుకుని ఒక ఇన్నోవా వాహనంలో సంజీవ, నవీన్‌కుమార్, సుబ్బరాయుడు, మదనగోపాల్, శివ, మహమ్మద్ ఇస్మాయిల్, మద్దిలేటిలు కత్తులు, ఇనుపరాడ్లు తీసుకుని వెళ్లారు. అక్కడ సాయికుమార్‌ను వెంబడించి పట్టుకుని అతి దారుణంగా హత్య చేశారు. నిందితులను ఆదివారం చాబోలు సమీపంలో అదుపులోకి తీసుకుని విచారించగా తామే హత్యచేసినట్లు అంగీకరించటంతో వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో సీఐలు దస్తగిరిబాబు, నరసింహులు ఎస్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'తోకలేని పిట్ట' నవలకు బహుమతి



అతిథుల చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న పుల్లా రామాంజనేయులు

కర్నూలు కల్చరల్: జిల్లా నవలా రచయిత, తెలుగు ఉపాధ్యాయుడు పుల్లా రామాంజనేయులు రాసిన తోకలేని పిట్ట నవలకు రాష్ట్ర స్థాయి బహుమతి లభించింది. చదువు – అన్వీక్షికి 2023 ఉగాది నవలల పోటీల్లో తోకలేని పిట్ట నవల యంగ్ అడల్ట్ ఫిక్షన్ విభాగంలో రూ.5000 బహుమతిని పొందింది. హైదరాబాద్ ప్రసాద్ సినిమా రివ్యూ థియేటర్‌లో సినిమా దర్శకులు వంశీ, నటులు, రచయిత డాక్టర్ తనికెళ్ల భరణి చేతుల మీదుగా రచయిత పుల్లా రామాంజనేయులు బహుమతిని అందుకున్నారు.

అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలి

గోస్పాడు: ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అంతర్ జిల్లా బదిలీలు నిర్వహించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు కోరారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు చాలా కాలంగా అంతర్ జిల్లా బదిలీలు జరగక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే షెడ్యూల్ విడుదల చేసి అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలన్నారు. అలాగే ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఐదు తరగతులకు కేవలం ఒకే ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నారని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు గురి కావాల్సి వస్తుందని, అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. జీవోనెం.117ను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వ్యక్తి అదృశ్యం

మిడుతూరు: స్థానిక మైనార్టీ కాలనీకి చెందిన ఓ యువకుడు కనిపించడం లేదని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి కేసు నమోదైనట్లు ఎస్ఐ జగన్‌మోహన్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన అస్లాం బాష పీఏస్‌కే కంపెనీలో పనిచేసేందుకు 31వ తేదీ సాయంత్రం 4:30 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లాడు. ఆగస్టు 1వ తేదీన తన భార్య ముంతాజ్‌కు ఫోన్ చేసి ఆలస్యంగా ఇంటికి వస్తానని చెప్పాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తుంది. చుట్టుపక్కల విచారించినా ఆచూకీ లభించలేదని తెలిపారు. దీంతో అన్న హంజద్‌బాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

ప్రతిభావంతులకు ప్రోత్సాహం



చెక్కులు అందజేస్తున్న అంజుమన్ సంస్థ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పదోతరగతిలో ప్రతిభ కనబర్చే విద్యార్థులకు తమ వంతు సాయం చేసి ప్రోత్సహిస్తున్నట్లు అంజుమన్ సంస్థ అధ్యక్షుడు నశ్యం అబ్దుల్‌కుద్దూస్ అన్నారు. పట్టణంలో 2024–25 విద్యాసంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన 370 మంది ముస్లిం విద్యార్థులకు రూ. 3 వేల చొప్పున ఆదివారం నగదు సాయం చేశారు. సంస్థ కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నీట్‌లో మంచి ర్యాంకులు సాధించిన పేద ముస్లిం విద్యార్థులకు సైతం సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ నంద్యాల శాఖ అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్, ఇమామ్‌ల సంఘం అధ్యక్షుడు అఫీజ్ అంజాద్‌బాషా సిద్దిఖీ, అబ్దుల్‌హక్, గౌస్, మోహిద్దీన్, ఇదాయతుల్లా, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఆలస్యమవుతున్న కారణంగా వెంటనే ఐఆర్ ప్రకటించాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌లో అమలు చేయాలని పురపాలక, ఎయిడెడ్, కేజీబీవీ మోడల్ స్కూల్‌లో పని చేసే ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. 117వ జీవోను రద్దు చేసి పని సర్దుబాటు జిల్లా ప్రాతిపదికన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహం వెలకట్టలేనిది



సంతోషం వ్యక్తం చేస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): స్నేహం వెలకట్టలేనిదని, సమాజంలో దీని కంటే గొప్పది ఏదీలేదని రమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్ యాడికి శ్రీదేవి పేర్కొన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమామహేశ్వరి మహిళా మండలి ఆధ్వర్యంలో స్నేహితులతో కలిసి పట్టణ శివారులోని మూలమఠంలో సరదాగా ఆటలు, పాటలు, విచిత్ర వేషధారణలు, జడల అలంకారం తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మండలి సభ్యులు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా కలిసిమెలసి ఉండి కష్టసుఖాల్లో ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందించుకోవడం స్నేహం యొక్క గొప్పతనమన్నారు. కార్యక్రమంలో అనురాధ, ఇందిరా, రాధాకుమారి, వసుంధర, శిరీష, సాయికుమారి, తదితర మహిళలు పాల్గొన్నారు.

కేసీకి నీటి విడుదల

పాములపాడు: మండలంలోని శాంతినిలయం గ్రామ సమీపంలో కేసీ కెనాల్ 120వ కిలోమీటరు లాక్ ఇన్‌ఫ్లా నుంచి ఆదివారం 1545 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఎగువ నుంచి వస్తున్న మొత్తం నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. లాక్ ఇన్‌ఫ్లా నుంచి నిప్పులవాగుకు 587 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్ చానల్ కి 630 , అలగనూరు రిజార్వాయర్‌కు 328 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

వీబీఆర్‌కు 16వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

వెలుగోడు: కృష్ణా జలాలు వెలుగోడు రిజర్వాయర్‌కు వచ్చి చేరుతున్నాయి. బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ చానల్ ద్వారా వీబీఆర్‌కు ఆదివారం 16,250 క్యూసెక్కులు వచ్చి చేరాయి. దీంతో వీబీఆర్ నుంచి తెలుగు గంగ మద్రాస్ కాల్వకు 4,500 క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 50 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

వైభవంగా శ్రీచౌడేశ్వరిదేవి జయంతి



ఉయ్యాలవాడ..ఆర్.జంబులదిన్నెలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



గోస్పాడు..అలంకరణలో అమ్మవారు



చాగలమర్రి.. అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ/చాగలమర్రి: నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో శ్రీ చౌడేశ్వరీ మాత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు దీప జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు. బోనాలు, చీరె సారె సమర్పించారు. లలితా సహస్రనామ స్తోత్ర సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలు గ్రామాల్లో ఆలయ కమిటీ సభ్యులు, దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

● చాగలమర్రి మండల కేంద్రం చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో వెలసిన గ్రామ దేవత శ్రీచౌడేశ్వరీదేవిని భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వా హకులు చక్రపాణి, దామోదర్, సుబ్బనర్సయ్య, రఘురాం, ప్రదీప్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

● ఉయ్యాలవాడ మండలంలోని ఆర్.జంబులదిన్నె, బోడెమ్మనూరు, సుద్దమల్ల, హరివారం గ్రామాల్లో ఆదివారం చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పణ చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆర్.జంబులదిన్నె గ్రామంలో జయంతి వేడుకల సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అర్చకులు లక్ష్మణస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గోస్పాడు: మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో శ్రీచౌడేశ్వరిదేవి జయంతిని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. గ్రామ మహిళలు ఊరేగింపుగా బోనాలను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులతో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

దాలు అందజేశారు.

● శాకాంబరిగా కాశీవిశాలాక్షి



నంద్యాల(వ్యవసాయం): సంజీవనగర్‌లో వెలసిన రామలయం వద్ద లోక కల్యాణం కోసం శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కాశీవిశాలాక్షి అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడి మంచి పంటలు పండాలని అమ్మవారిని ఆకుకూరలు, పండ్లతో అలంకరించినట్లు వేదపండితుడు యాదవల్లి కార్తికేయశర్మ తెలిపారు. భక్తులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సముద్రాల సూరయ్య, శ్రీనివాసు, మధుసూదన్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దమ్మా..దీవించమ్మా

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు ఇచ్చారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు అమ్మవారికి మొక్కుగా చెలించారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, శంకరయ్య, చిన్నపెద్దన్న, చిన్నన్నలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



దొర్నిపాడు తహసీల్దార్‌గా సుభద్ర

దొర్నిపాడు:మండల నూతన తహసీల్దార్‌గా సుభద్రను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్వర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు సత్యసాయి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఉయ్యాలవాడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆమె రెండు నెలల పాటు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన అనుభవం ఉంది. సోమవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

ఉయ్యాలవాడ తహసీల్దార్‌గా శ్రీనివాసులు

ఉయ్యాలవాడ: మండల తహసీల్దార్‌గా ఎం.శ్రీనివాసులును నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్వర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ సార్వత్రిక ఎన్నికల సమయంలో తహసీల్దార్‌గా వెంకటరమణ విధులు నిర్వహించారు. ఆయన ఇటీవలే కడప కలెక్టరేట్‌కు బదిలీ కావడంతో రెగ్యులర్ తహసీల్దాగా శ్రీనివాసులు నియమితులయ్యారు. కొత్త తహసీల్దార్ సోమవారం నుంచి బాధ్యతలు స్వీకరించనున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

కిక్కిరిసిన ముక్కంటి క్షేత్రం

శ్రీశైలంటెంపుల్: ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం కలగలసి వెలసిన మహాపుణ్య క్షేత్రం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రీశైలం డ్యాం క్రస్ట్‌గేట్ల నుంచి సాగర్‌కు నీటి విడుదల కొనసాగుతుండడంతో కృష్ణమ్మ పరవళ్లను చూసేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. శ్రీగిరి చేరుకున్న భక్తజనం వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందిన పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థాన అధికారులు వీఐపీ బ్రేక్ దర్శనాలను నిలుపుదల చేశారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

అలరించిన భక్తిరంజని

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణమాఢ వీధిలోని నిత్యకళావేదికపై నల్గొండకు చెందిన జి.వి.ఆర్.మ్యూజిక్ ఇన్‌స్టిట్యూషన్ వారు నిర్వహించిన భక్తిరంజని కార్యక్రమం భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణేశ పంచరత్నం, భో శంభో, రాజరాజేశ్వరి, ఓం నమోనమ నటరాజా, శివపంచాక్షరి, కాశీవిశ్వనాథాష్టకం , శివాష్టకం, శివస్తోత్రం తదితర గీతాలు, అష్ట కాలను ఆధ్య, కిరణ్, శ్యాం, సాన్విరెడ్డి, అంగుళిక, దాక్షయణి, సిద్ధార్ధ, జయ, శ్రీవాణిదేవి, వినోదాదేవి ఆలపించారు.